T.C.037

013/DM/26

Register Number									

DEPARTMENTAL EXAMINATIONS

TRANSLATION TEST — SECOND PAPER — TRANSLATION OF NEWS PAPER REPORT IN TELUGU TO ENGLISH

(Without Books)

Maximum Time : 2.30 hours Maximum Marks : 100

Answer ALL five questions. **(5 × 20 = 100)**

Translate into English.

1. యూనిసెఫ్ (UNICEF) ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళిక సంఘం (Planning Commission) అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమానేస్తున్నారు. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాల కార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థల అంచనా ప్రకారం భారతదేశంలో 6 కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారు. అనధికారిక గణాంకాల ప్రకారం భారత్‌లో 10 కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాతం మంది వివిధ పనుల్లో చెమటోడ్చుతున్నారని అంచనా. మొత్తం కార్మికుల్లో 4 శాతం మంది బాలలేనని అంచనా. ప్రతీ పది మంది బాల కార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవుతున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేదింపులకు బాధితులవుతున్నారు.

2. టోకు ధరల సూచి (WPI) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 5.28 శాతంగా నమోదయ్యింది. అంటే 2017 అక్టోబర్‌తో పోల్చితే 2018 అక్టోబర్‌లో టోకున ధరలు 5.28 శాతం పెరిగాయన్నమాట. టోకు ధరలు ఈ స్థాయిలో నమోదు కావడం వరుసగా ఇది నాల్గవ నెల. 2017 సెప్టెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 5.13 శాతంకాగా, గత ఏడాది అక్టోబర్‌లో 3.68 శాతంగా ఉంది. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాలను చూస్తే టోకున ఆహార ఉత్పత్తుల ధరల అక్టోబర్‌లో అసలు పెరగకపోగా 1.49 శాతం తగ్గాయి. కూరగాయల ధరలు 18.65 శాతం తగ్గాయి. సెప్టెంబర్ నెలలో ఈ తగ్గుదల 3.83 శాతం. అయితే నూనె ధరలు భారీగా 93.65 శాతం పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 31.69 శాతం తగ్గగా, పప్పు దినుసుల ధరలూ 13.92 శాతం తగ్గాయి. ఇంధనం, పవర్ బాస్కెట్‌లో ధరల పెరుగుదల రేటు 18.44 శాతంగా ఉంది. ఇందులో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా 19.85 శాతం, 23.91 శాతం చొప్పున పెరిగాయి.

[Turn over

3. ప్రపంచంలో అత్యంత విపత్తు ముప్పు కలిగి ఉన్న మొదటి 10 దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. ఇందుకు అనేక ప్రకృతిపరమైన మానవ ప్రేరేపిత కారకాలు దోహదం చేస్తున్నాయి. ప్రతికూల భౌగోళిక, శీతోష్ణస్థితి పరిస్థితులు, స్థలాకృతి స్వభావాలు, పర్యావరణ క్షీణత, జనాభావృద్ధి, పట్టణీకరణ పెరుగుదల, పారిశ్రామికీకరణ మొదలైన వాటిల్లో అశాస్త్రీయ పద్ధతుల అవలంబన మొదలైన కారణాల వల్ల దేశంలో విపత్తుల తీవ్రత పెరుగుతోంది. ఈ కారకాలు నేరుగా గానీ, విపత్తు తీవ్రతను, ఆవృత్తిని పెంచడం ద్వారా గానీ పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థను ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. భారతదేశం తుఫాన్లు వరదలు భూకంపాలు, కరువులు వంటి ప్రకృతి విపత్తులకు దారితీయడానికి దాని విశిష్టమైన భౌగోళిక, భౌమ పరిస్థితులు చాలా వరకు దోహదపడుతున్నాయి.

4. ఇండియా వ్యవసాయిక దేశం. మన ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, వ్యవసాయక పురోభివృద్ధి దేశ ఆర్థిక ప్రగతిని ప్రభావితం చేస్తుంది. మూడింట రెండు వంతుల జనాభా తమ జీవనాధారానికి వ్యవసాయం మీదనే ఆధారపడుతోంది. గత రెండు మూడు దశాబ్దాలలో వ్యవసాయ రంగం గణనీయమైన అభివృద్ధి సాధించింది. 1950-51 లో 51 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగితే, 2011-12 లో అది 250 మిలియన్ టన్నులకు చేరుకుంది. నూనె గింజల ఉత్పత్తి 5 మిలియన్ టన్నుల నుంచి 28 మిలియన్ టన్నులకు పెరిగింది. వ్యవసాయ సరుకులైన వరి, గోధుమ, తృణధాన్యాలు వేరుశనగ, పండ్లు, కూరగాయలు చెరకు మొదలైన వాటి ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానానికి ఎదిగింది.

5. భారతదేశంలో 1857 లో మూడు విశ్వ విద్యాలయాలను ప్రారంభించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రెండు డజన్ల విశ్వ విద్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేట్ రంగం కలిపి 500 కాలేజీలు ఉండేవి. ప్రస్తుతం డీమ్డ్ యూనివర్సిటీలతో సహా మొత్తం 600 పైగా విశ్వ విద్యాలయాలు, 30 వేలకు పైగా కాలేజీలు ఉన్నాయి. ఈ యూనివర్సిటీల్లో ఒక కోటి 5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో ఉన్నత విద్య చదువుతున్న వారి సంఖ్య తక్కువే. దేశంలో 17 నుంచి 24 సంవత్సరాల లోపు యువతలో కేవలం తొమ్మిది శాతమే కళాశాలల్లో చేరుతున్నారు. ప్రపంచ సగటులో ఇది కనీసం సగం కూడా కాదు. అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ లాంటి దేశాల్లో విశ్వ విద్యాలయాల సంఖ్య జనాభాతో పోలిస్తే చాలా ఎక్కువ. అమెరికాలో 31.4 కోట్ల మంది జనాభా ఉంటే 2400 విశ్వవిద్యాలయాలున్నాయి. జపాన్‌లో 12.65 కోట్ల జనాభాకు 684 విశ్వ విద్యాలయాలు. జర్మనీలో 8.17 కోట్ల జనాభాకు 320 విశ్వవిద్యాలయాలు బ్రిటన్‌లో 6 కోట్ల జనాభాకు 104 విశ్వ విద్యాలయాలున్నాయి.
